క్లుప్తంగా

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



తహసీల్దార్ భారతి విజయలక్ష్మి సత్కరిస్తున్న సభ్యులు

పాలకోడేరు: వాసవీ మాత అందించిన ఆత్మ గౌరవ స్ఫూర్తిని అందరూ అలవర్చుకోవాలని తహసీల్దార్ ఎన్ భారతి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం శృంగవృక్షం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. బట్టలు, పువ్వులు, పండ్లు అమ్మవారికి సమర్పించారు. అనంతరం తహసీల్దార్‌ను సంఘ మహిళలు సత్కరించారు. ఈ సందర్భంగా అక్షర కిరీటి, కవి, తెన్నేటి లక్ష్మీ నరసింహ మూర్తి వాసవి మాత జీవిత చరిత్రను వివరించారు. తొలుత వాసవీ మాతకు అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, కోశాధికారి అత్యం వాసు పాల్గొన్నారు.

వీధి బాలలకు బడిలో చదువుకునే అవకాశం



సదస్సులో మాట్లాడుతున్న సుధీర్

భీమవరం: బడికి బయట ఉన్న వీధి బాలలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువస్తే వారిని బడిలో చేర్పించి చదువుకునే అవకాశం కల్పిస్తారని ప్యానల్ న్యాయవాదులు ఎస్ సుధీర్, బి లోకేశ్వరరావు అన్నారు. శుక్రవారం వీధి బాలల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అడబాల చంద్రరావు ఎలిమెంటరీ స్కూల్లో విద్యా హక్కు చట్టం, గుడ్ టచ్–బ్యాడ్ టచ్ వంటి అంశాలపై భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్యానల్ న్యాయవాదులతో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి మావుళ్ళమ్మ ప్యానల్ న్యాయవాదులు పి అంబేడ్కర్, కె జ్యోతి, ఎల్‌సీపీవో సీహెచ్ విజయ, ఓఆర్‌డబ్ల్యూ వెంకటేష్, పారా లీగల్ వలంటీర్స్ ఎస్ జానకిరామ్, కె నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు



శ్రీకృష్ణ తులాభారం నాటకంలోని ఓ సన్నివేశం

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మవారి 61వ వార్షిక మహోత్సవాల్లో ప్రతి రోజూ నిర్వహిస్తున్న పలు కళా ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పార్వతి పరమేశ్వర నృత్య కళానికేతన్ భీమవరంవారు ప్రదర్శించిన భరతనాట్యం, సాయంత్రం 6గంటలకు రాజు ఆర్కెస్ట్రా తణుకు వారి సినీ మ్యూజికల్ నైట్ అలరించాయి. రాత్రి 9 గంటలకు మావుళ్లమ్మ నాట్యమండలి ప్రదర్శించిన శ్రీకృష్ణతులాభారం నాటకం అలరించింది.పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈకార్యక్రమాలను తిలకించారు. ఉత్సవాల నిర్వాహకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూ డెస్టినీ-125 స్కూటర్ మార్కెట్లోకి విడుదల



భీమవరం రెడ్డి అండ్ రెడ్డి హీరో షోరూమ్‌లో నూతన స్కూటర్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్న దృశ్యం

భీమవరం: ఆధునిక సాంకేతికత హంగులతో హీరో మోటోకార్ప్ రూపొందించిన న్యూ డెస్టినీ–125 స్కూటర్ మార్కెట్‌లోకి వచ్చిందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రెడ్డి అండ్ రెడ్డి హీరో షోరూమ్‌లో న్యూ డెస్టినీ స్కూటర్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. షోరూమ్ మేనేజర్ పవన్ మాట్లాడుతూ న్యూ డెస్టినీ స్కూటర్‌లో సేఫ్టీ టెక్నాలజీ, సౌకర్యవంతమైన ప్రయాణానికి అవసరమైన అనేక సౌకర్యాలతో రూపొందించడంతో విద్యార్థులు, ఫ్యామిలీ, వ్యాపారులకు అనువుగా ఉంటుందన్నారు. న్యూ డెస్టినా–125 స్కూటర్ మూడు వేరియంట్లలో అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రవి, వర్క్‌షాప్ మేనేజర్ సతీష్, మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు హనుమంతరావు పాల్గొన్నారు.

4న సేవకుల సదస్సు

ఉండి: మండలంలోని చెరుకువాడ జీవం గల దేవుని సంఘం ప్రార్థనా మందిరంలో పాస్టర్ రాపాక జయరాజు ఆధ్వర్యంలో సేవకుల సదస్సు ఈ నెల 4న నిర్వహించనున్నట్టు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యూపీఎఫ్) మండల అధ్యక్ష కార్యదర్శులు పాస్టర్ సోడదాసి పీటర్, వై.యోనాతాన్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే సదస్సులో యూపీఎఫ్ సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే

- భీమవరం నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతున్న సర్వే
- ఫిబ్రవరి 4 వరకు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు
- భీమవరం నియోజకవర్గంలో 70 శాతం సర్వే పూర్తి



భీమవరంలో కుష్టు వ్యాధిపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



భీమవరం దుర్గాపురం అర్బన్ పీహెచ్‌సీ వద్ద కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం(ప్రకాశం చౌక్) : కుష్టు వ్యాధి మహమ్మారిని సమాజం నుంచి దూరం చేయాలని లక్ష్యంతో గత ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఇంటింటి సర్వే చేపట్టి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్యం అందించి ప్రాణాంతకారమైన వ్యాధిగా మారకుండా తగు చర్యలు తీసుకుంది. ఈ ఏడాది కూడా వైద్యఆరోగ్య శాఖ కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వేను కొనసాగిస్తోంది. ఈ సర్వే భీమవరం నియోజవర్గంలో ముమ్మురంగా సాగుతోంది. ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఈసర్వే ఇంటింటా సాగుతుంది. భీమవరం నియోజవర్గంలో ఇప్పటివరకు 70 శాతం సర్వే పూర్తయిందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు అనుమానిత కేసులు 600 వరకు ఉన్నాయి. వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాజిటివ్ కేసులు ఉంటే వెంటనే వారికి వైద్యం అందించి వ్యాధి నుంచి రక్షించే కల్పించేందుకు అవసరమైన చర్యలు వైద్యారోగ్య శాఖ చేపట్టింది.

కుష్టు వ్యాధి వ్యాప్తి– లక్షణాలు

కుష్టు వ్యాధి ఒక బ్యాక్టీరియా ద్వారా వస్తుంది. వ్యాధి లక్షణాలను సులభంగా గుర్తించవచ్చు. చర్మం మీద స్పర్శ లేని మచ్చలు ఉన్న వారు దగ్గరలో ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేసుకుని చికిత్స పొందవచ్చు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎండీటీ మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. సకాలంలో వైద్యం వల్ల వ్యాధి పూర్తిగా నయమవుతుంది. 6 నుంచి 12 నెలలల్లో వ్యాధి నివారించవచ్చును. స్పర్శ లేని మచ్చలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా స్థానింగా ఉన్న పీహెచ్‌సీ లేదా విలేజ్ క్లినిక్‌లోని వైద్యులు చూపించాలి. అక్కడ అనుమానం వ్యక్తం చేస్తే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులకు చూపించుకోవడం చాలా ముఖ్యం.

70 శాతం సర్వే పూర్తి



కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే భీమవరం నియోజకవర్గంలో దాదాపు 70 శాతం మేర పూర్తి చేశాం. 600 మంది వరకు అనుమానిత కేసుల గుర్తించి వారికి పూర్తి వైద్య పరీక్షలు చేపట్టాం. వ్యాధి సోకిన్నట్లు నిర్ధారణ అయితే వెంటనే వైద్యం అందించి కుష్టు వ్యాధిని నయం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధి లక్షణాలు ఉన్న రోగులు భయపడకుండా సకాలంలో మందులు వాడితే ఆరోగ్యంగా జీవించవచ్చు.

– డాక్టర్ భానునాయక్, జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

లక్షణాలు

- చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం
- చెవులపై, వీపులపై, ఛాతీపై నొప్పిలేని బుడిపెలు
- కనుబొమ్మలు, కనురెప్పలు వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూతపడకపోవడం, ముక్కుదిబ్బడ
- ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు
- పాదాల వాపు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేక పోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం తెలియకుండానే చేతులు, కాళ్లల్లో బొబ్బలు రావడం
- చేతి, కాలు వేళ్ల వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం

ప్లాస్టిక్ నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్లాస్టిక్ నిషేధ ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫిబ్రవరి 1 నుంచి నిబంధనలు అమల్లోకి వస్తాయని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రరెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలు హోటళ్లకు స్టీల్ సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులతోపాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు కూడా ప్లాస్టిక్ నిషేధ అమలుపై తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ ప్రయత్నాల్లో భాగంగా ప్రతి హోటల్‌లో అవగాహన కోసం స్టీల్ సామగ్రిని ఉచితంగా అందించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సర్ సీవీ రామన్ స్కూల్ కరస్పాండెంట్ రావణం వేణుగోపాలరావు సహకారంతో 6 హోటళ్లకు స్టీల్ సామగ్రిని అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరితా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ రామచంద్రారెడ్డి

సమస్యలపై దద్దరిల్లిన సమావేశం

- దోమలు, కుక్కల బెడద, మంచినీటి లోపాలపై ధ్వజం
- అధికారుల నిర్లక్ష్యంతో ఆదాయానికి గండి
- కౌన్సిలర్లు ఆగ్రహం



సమావేశంలో అధికారుల నిర్లక్ష్యంపై ధ్వజమెత్తుతున్న వైస్ చైర్మన్ పండు

ఆకివీడు : ఆకివీడు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం సమస్యలతో దద్దరిల్లింది. శుక్రవారం చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కౌన్సిలర్లు సమస్యలను ఏకరవు పెట్టారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. సమావేశంలో వైస్ చైర్మన్ పుప్పాల సత్యనారాయణ (పండు) మాట్లాడుతూ పట్టణంలో 10 వేలకు పైగా ఉన్న కుళాయి కనెక్షన్ల ఆన్‌లైన్ చేస్తే నగర పంచాయతీకి ఆదాయం పెరుగుతుందన్నారు. ఆకివీడు నగర పంచాయతీ ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆదాయానికి గండి పడుతోందని ఆరోపించారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కౌన్సిలర్ నిమ్మల నాగేశ్వరరావు (నాగు) మాట్లాడుతూ పట్టణంలో దోమలు, కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. ఫాగింగ్ మెషీన్లు ఏమయ్యాయని, కుక్కల బెడదపై గత రెండు సమావేశాల్లో సభ్యులు లేవనెత్తినా పట్టించుకోకపోవడాన్ని ప్రశ్నించారు. రిపబ్లిక్ డే రోజు మాంసం అమ్మకూడదని తెలిసినప్పటికీ, అధికారులు అమ్మకందారులపై అపరాధ రుసుము విధించడం, ఆ సొమ్మును సకాలంలో ఎందుకు జమచేయలేదని నిలదీశారు. మాంసం అమ్మకాలపై పర్యవేక్షణ కొరవడిందన్నారు. కౌన్సిలర్లు నేరెళ్ల ప్రసన్న, గోపిశెట్టి సత్యవతి మాట్లాడుతూ మంచినీటి సమస్య, దొరగారి చెరువు వద్ద ఏర్పాటు చేసిన పార్కు కం వాకింగ్ ట్రాక్ వద్ద మల మూత్ర విసర్జన చేస్తున్నారని, విద్యుత్ సదుపాయం లేకదని తెలిపారు. కమిషనర్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ కుక్కల, దోమల బెడద, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పార్కు ప్రాంతంలో త్వరలో లైటింగ్ ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.58 కోట్ల నిల్వ బడ్జెట్

సమావేశంలో 2024–25 ఆర్థిక సంవత్సరం ఆదాయ, వ్యయాల పట్టిక (బడ్జెట్) సమాచారాన్ని పీడీ అకౌంటు ఖాతాల వారీగా పేర్కొన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభ నిల్వతో సాధారణ నిధుల ఖాతాలో ఆదాయం మొత్తం రూ.3,08,65,860 ఉండగా, వ్యయం రూ.88,78,930గా చూపారు. ముగింపు నిల్వ రూ. 2,19,86,930 ఉంది. 2025 ఆర్థిక సంవత్సరానికి జీతభత్యాల ఖాతాలో ప్రారంభ నిల్వతో ఆదాయం రూ.3,62,56,340 ఉంది. వ్యయం రూ.2,04,73,505 కాగా ముగింపు నిల్వ మొత్తం రూ.1,57,82,835 ఉందని తెలిపారు.

దళితవాడల్లో సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: దళితవాడల్లోని సమస్యల పరిష్కారానికి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ దళిత వాడల్లో సర్వే నిర్వహించగా అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. గణపవరం మండలం అర్ధవరంలో 500 కుటుంబాలున్న ఎస్సీ పేటకు కేవలం 26 సెంట్లు మాత్రమే శ్మశాన వాటిక ఉండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు తగినన్ని చూపడం లేదని, కనీస వేతనం, 500 పని దినాలు కల్పించాలన్నారు. కొన్ని గ్రామాల్లోని దళిత వాడలకు 104, రేషన్ వాహనం రావడం లేదన్నారు. ఇళ్ల స్థలాలు లేనివారికి ప్రభుత్వం మూడు సెంట్ల స్థలమిచ్చి రూ. 5 లక్షలు గృహ నిర్మాణానికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు కొరు పెద్దిరాజు, బళ్ల చిన్న వీరభద్రరావు, సహాయ కార్యదర్శి ఎస్ అశ్రీయ్య, గుబ్బల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జంతువులను సంరక్షించాలి



జంతు సంక్షేమ పక్షోత్సవాల ముగింపు సదస్సులో మాట్లాడుతున్న హుస్సేన్

భీమవరం: జంతువులను ప్రేమించి వాటిని పరిరక్షించుకోవడం మానవ ధర్మమని జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాఫర్ హుస్సేన్ అన్నారు. జిల్లా జంతు సంక్షేమ సంఘం, జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాల ముగింపు సదస్సులో ఆయన మాట్లాడారు. మూగజీవాల సంక్షేమం కోసం ప్రభుత్వం జంతు హింస నివారణ చట్టం అమలులోకి తెచ్చిందన్నారు. జంతువులు, పక్షులను, నీటిలో జీవించే జీవులను హింసించినా చట్టప్రకారం జంతు సంక్షేమ బోర్డు శిక్షిస్తుందన్నారు. ప్రిన్సిపల్ ఎలీషా, నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుధాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



అనాకోడేరులో హైస్కూల్లో మెర్సీ నిర్మల కుమారిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విధుల పట్ల అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు వస్తుందని ప్రధానోపాధ్యాయులు బొండా వేంకటేశ్వరరావు అన్నారు. భీమవరం మంలంలోని అనాకోడేరులో డీఎన్నార్ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం వంటా బత్తిన మెర్సీ నిర్మలాకుమారికి పదవీ విరమణ సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్నేహశీలి, మృదు స్వభావి మెర్సీ నిర్మలకుమారి సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీత మెర్సీ నిర్మలకుమారి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసినప్పటికీ పదో తరగతి విద్యార్థులకు బోధన పరంగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా మెర్సీ నిర్మలకుమారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు, ఎంపీటీసీ మైనపు వెంకటేశ్వరరావు, వనిమరుద్ర భాస్కరరావు, గొర్ల వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలిథీన్ నిషేధంపై అవగాహన



పాలిథీన్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు : పాలిథీన్ నిషేధం ఫిబ్రవరి 1 నుంచి అమలవుతుందని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణ మోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాలిథీన్ కవర్లు, గ్లాసులు, ఇతర వస్తువుల కవర్ల వినియోగం నిలుపుదలకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కమిషనర్ కోరారు. మూడు రోజులుగా అన్ని దుఖాణాల వద్ద పాలిథీన్ కవర్ల వినియోగం నిలుపుదల చేయాలని పెద్ద ఎత్తున ప్రచారం చేశామన్నారు. ఈ ర్యాలీలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

రేపు టాలెంట్ టెస్ట్

పాలకొల్లు అర్బన్: స్థానిక చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.5వేలు నుంచి రూ.25 వేలు వరకు ఫీజులో రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. చాంబర్స్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బీసీఏ కోర్సును ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

లేబర్ కోడ్ రద్దు చేసే వరకు పోరాటం



భీమవరంలో సీఐటీయూ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

భీమవరం: లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ భీమవరం రూరల్ మండలం నాయకుడు ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం హేమలత అధ్యక్షతన నిర్వహించిన మండల సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి అడ్డగోలుగా లేబర్ కోడ్లను తీసుకువచ్చి ఉద్యోగులు, కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినప్పటికీ ప్రజలకు చేసిందేమీ లేకపోయినా ఉన్న చట్టాలను తీసివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా నిరసనలో భాగంగా భీమవరంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు శ్రీనివాస్ చెప్పారు. ఈ సమావేశంలో సురేష్, దీపిక, మారెమ్మ పాల్గొన్నారు.

ఈస్ట్ కుక్కిలేరును ఆధునికీకరించాలి



వేములదీవిలో ఈస్ట్ కుక్కిలేరును రైతులతో కలిసి పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి వెస్ట్ గ్రామంలోని మోడిపర్ర నుంచి వేములదీవి ఈస్ట్ వరకూ ఈస్ట్ కుక్కిలేరును తక్షణమే ఆధునికీకరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, వేములదీవి నీటి సంఘం అధ్యక్షులు అడ్డాల శ్రీనివాస్‌లు రైతులతో కలిసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. డ్రైనేజి శాఖ ఏఈ పావణ్యతో కలిసి సమస్యాత్మకంగా ఉన్న ఈస్ట్ కుక్కిలేరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఈ డ్రెయిన్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పలు చోట్ల ఆక్రమణలకు గురై పూడుకుపోయిందని, దీంతో తీరపారతంలో ఉన్న వేలాది ఎకరాలు ఎలాంటి సాగుకు పనికి రాకుండా తయారు కావడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గొందిమూల శివారు మోడిపర్ర నుంచి వేములదీవిఈస్ట్ గ్రామం వరకూ పూర్తి స్థాయిలో ఆధునికీకరించాలన్నారు. ఈ సందర్భంగా ఏఈ పావణ్య మాట్లాడుతూ ఇప్పటికే ఈస్ట్ కుక్కిలేరు డ్రెయిన్ ఆధునికీకరణకు రూ.46 లక్షలతో అంచనాలు పంపించామన్నారు. రైతుల కోరిక మేరకు మళ్లీ ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు తిరుమాని నాగరాజు, బొక్కా వెంకటేశ్వరరావు, తుమ్మా సూర్యారావు, కవురు శ్రీనివస్ శ్రీరాములు, బొక్కా సత్యనారాయణ, బొక్కా హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాకు రెండు ప్రత్యేక బస్సులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగరాజ్ కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు జిల్లాలోని భీమవరం, నర్సాపురం డిపోల నుంచి రెండు సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 4వ తేదీ మంగళవారం మధ్యాహ్నం ఈ బస్సులు భీమవరం, నర్సాపురంలో బయలుదేరి పూరీ, కోణార్క్, భువనేశ్వర్, ప్రయోగ రాజ్ సంగమ స్థానం, కాశీ, అయోధ్య, గయ, బుద్ధగయ ప్రసిద్ధి చెందిన దేవాలయాలను చూపించి తిరుగు ప్రయాణంలో అరసవల్లి సూర్యదేవాలయం, శ్రీ కూర్మం దేవాలయాల దర్శనం అనంతరం ఫిబ్రవరి 12న భీమవరం, నర్సాపురం చేరుకుంటాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్ల రిజర్వేషన్ ప్రారంభించామన్నారు. టికెట్ ధర రూ.10వేలు నిర్ణయించినట్టు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు పందిరి రాట పూజలు



పంచారామక్షేత్రం వద్ద పందిరి రాట పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పంచరామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి వార్ల దేవస్థానం ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీ వరకు వార్షిక కల్యాణోత్సవాలు (మహాశివ రాత్రి కల్యాణోత్సవాలు) నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం దేవస్థానం వద్ద పందిరి రాట పూజ నిర్వహించి శివరాత్రి పనులకు శ్రీకారం చూట్టారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

వాసవీమాతకు పట్టు వస్త్రాల సమర్పణ



ఆత్మార్పణ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: శ్రీమాతా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 450 మంది సువాసినీలతో మూల గాయత్రి మంత్రోచ్చరణతో కుంకుమార్చన నిగ్వహించారు. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనము, యువజన సంఘం ఆధ్వర్యంలో భీమవరం త్యాగరాజ భవనంలో మాతా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామోత్సవం, రథోత్సవం, అష్టోత్తర (108 కలశములు) కలశాభిషేకం, అనంతరం కుంకుమార్చన, లక్ష చామంతి పూలతో పుష్పార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి తటవర్తి బదరీ లక్ష్మీనారాయణ, యువజన సంఘం అధ్యక్షుడు జూలూరి వెంకటేష్, కార్యదర్శి పెరుమాళ్ళ శివ, వబిలిశెట్టి కిషోర్, పులవర్తి విశ్వనాథరావు, బోండా నిషాంత్, మండ చంద్రశేఖర్, సమయమంతుల రవిప్రసాద్, నవీన్, కోళ్ల నాగేశ్వరరావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

ఎయిడెడ్ సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనుగొండ: ఎయిడెడ్ విద్యా సంస్థల సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబుకు వినతి పత్రం సమర్పించినట్లు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వాసవీ మాత ఆత్మర్పణ దినోత్సవం సందర్భంగా పెనుగొండ వచ్చిన సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరించి, వినతి పత్రం సమర్పించినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతంలో బాలబాలికల ఉన్నత విద్యాభివృద్ధి లక్ష్యం 1974లో స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న పెనుగొండ ఎస్వీకేపీ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టులు భర్తీ చేయాలని, అన్ ఎయిడెడ్‌గా పని చేస్తున్న ఎయిడెడ్, కాంట్రాక్టు సిబ్బందికి ఎంటీఎస్ స్కేలు వర్తింప చేయాలని కోరారు.